
# తెలుగుప్రభ
మన భాష.. మన పత్రిక
teluguprabha.net
-TeluguPrabha
@TeluguPrabhaofficial
TS వైబ్రెంట్ ఎడిషన్ 4 pm
ఆదివారం 30-7-2023

## ఆ జిల్లాల్లో మళ్లీ వర్షాలు

**హైదరాబాద్, జూలై 30 (తెలుగుప్రభ)**

వర్షాలు కాస్త తెరిపిచ్చాయి. వచ్చే మూడు రోజులు రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరంలో అల్పపీడనం ఏర్పడినట్టు వెల్లడించింది. ఆగస్టు 1వ తేదీన ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్లా, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ, ఆగస్టు 2న కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్టు వివరించింది.

# బీజేపీలో తలోమాట

### ఎస్టీ రిజర్వేషన్ లపై భిన్న స్వరాలు





**హైదరాబాద్, జూలై 30 (తెలుగుప్రభ)**

**భారతీయ జనతా పార్టీలో కూడా క్రమ శిక్షణ గాడి తప్పుతోంది. ఒకే అభిప్రాయం లేకుండా నేతలు ఒక్కొక్కరు ఒక్కో తీరు ఉన్నట్లు కనిపిస్తోంది. అందుకు ఎస్టీ రిజర్వేషన్లే ఉదాహరణగా నిలుస్తున్నాయి.**

ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ సోయం బాపురావు గతంలో మాట్లాడుతూ.. లంబాడాలను ఎస్టీ రిజర్వేషన్ల నుంచి తొలగించాలంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అది తమ పార్టీ ఉద్దేశం అన్నట్లుగానే ఆయన స్పందించారు. దీనిపై తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి భిన్నంగా స్పందించారు. ఆయన మాటలకు, పార్టీకి సంబంధం లేదని తేల్చి చెప్పారు. అంతేకాదు.. అధికారంలోకి రాగానే ఎస్టీ రిజర్వేషన్లు పెంచుతాం.. ఎంపీ సోయం బాపురావు చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం మాత్రమే అన్నారు. భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన వరంగల్ నగరాన్ని, ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలను కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆదివారం సందర్శించారు. ముంపునకు గురైన ప్రాంతాలను కిషన్ రెడ్డి పరిశీలించారు. భద్రకాళి చెరువు తెగిన ప్రదేశాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ఉన్న సౌకర్యాలు.. అందుతున్న సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన కిషన్ రెడ్డి తెలంగాణలో వర్షాలు, వరదల వల్ల ఏర్పడిన పరిస్థితిని కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వివరించినట్టు తెలిపారు. నష్టాన్ని అంచనా వేసేందుకు త్వరలోనే కేంద్ర బృందం తెలంగాణకు రానుందని వెల్లడించారు. మూడు రోజులపాటు కేంద్ర బృందం వరద ప్రాంతాలను సందర్శించి వివరాలు సేకరిస్తుంది తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక కూడా తీసుకుంటుందని వివరించారు. వరదల వల్ల ఆస్తి నష్టంతో పాటు ప్రాణనష్టం కూడా సంభవించడంపై కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం భూపాలపల్లి, తదితర ప్రాంతాలలో కిషన్ రెడ్డి పర్యటిస్తున్నారు. వరదల పరిస్థితి.. పంట, ప్రాణ నష్టం గురించి అడిగి తెలుసుకుంటున్నారు. కిషన్ రెడ్డితోపాటు.. వెంట పలువురు బీజేపీ నేతలు ఉన్నారు.

## ఫొటోలు పంపాలంటూ.. మహిళా ఉద్యోగికి సీఐడీ ఎస్పీ వేధింపులు!

### పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

**హైదరాబాద్, జూలై 30 (తెలుగుప్రభ)**

ఉన్నత స్థాయి ఉద్యోగంలో ఉండి.. ఓ మహిలా ఉద్యోగిని వేధిస్తున్న అధికారిపై పోలీస్‌స్టేషన్ లో కేసు నమోదైంది. వేధింపులకు పాల్పడ్డారంటూ ఆరోపణలు రావటంతో తెలంగాణ సీఐడీ ఎస్పీ కిషన్ సింగ్‌పై చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ కిషన్ సింగ్ తనను లైంగికంగా వేధించాడని హైదరాబాద్ నగరంలో పని చేస్తోన్న ఓ టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీనియర్ అసిస్టెంట్ మహిళ ఉద్యోగిని చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ కిషన్ సింగ్ తన ఫోన్‌కు అభ్యంతరకర ఫోటోలు, వీడియోలు పంపించి వేధిస్తున్నారని మహిళ ఆరోపించారు. 'కిషన్‌సింగ్.. అసభ్యకర మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోలు నా ఫోన్‌కు పంపిస్తున్నారు. చీర కట్టుకుని ఉన్న ఫొటోలు పంపాలంటూ వేధిస్తున్నారు. ఆ టార్చర్ తట్టుకోలేక పోలీసులను ఆశ్రయించాను' అని సదరు మహిళా ఉద్యోగి ఆరోపించారు. రెండేళ్ల క్రితం సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో కిషన్ సింగ్ పరిచయమైనట్లు తెలిపారు. తాను స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నానని వాటిలో పాల్గొనాలని చెప్పిన కిషన్ సింగ్.. తన వద్ద నుంచి ఫోన్ నంబర్ తీసుకున్నట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్పీ కిషన్ సింగ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




## రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర

**హైదరాబాద్, జూలై 30 (తెలుగుప్రభ)**

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి శనివారం చేపట్టిన ఉప్పల్ పర్యటనతో పార్టీ మేలు కన్నా కీడే ఎక్కువగా జరిగినట్లు కనిపిస్తోంది. రేవంత్ సాక్షిగానే పార్టీ నేతలు ఒకరినొకరు ఘర్షణ పడ్డారు. దీంతో పార్టీ ప్రతిష్ట అప్రతిష్ట పాలైంది. మరోవైపు.. ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా పార్టీకి నష్టం కలిగించేలేగా ఉన్నాయన్న అభిప్రాయాలూ వ్యక్తం అవుతున్నాయి. తాజాగా బీఆర్ ఎస్ శ్రేణులు నిరసనలు చేపడుతున్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా హైదరాబాద్ ఉప్పల్‌లో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దగ్ధం చేశారు. రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. ఐదేళ్ల నుంచి రేవంత్ రెడ్డి కనిపించకుండా పోయి మల్కాజ్‌గిరి ప్రజలను మోసం చేశారని బొంతు రామ్మోహన్ విమర్శలు గుప్పించారు. రేవంత్ ఇలాంటి రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు.



## ఇంట్లో నిద్రిస్తున్న రెండు నెలల చిన్నారిపై వీధి కుక్క దాడి..

**కామారెడ్డి, జూలై 30 (తెలుగుప్రభ)**

వీధి కుక్కల దాడులపై కలకలం రేగుతూనే ఉంది. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించినప్పటికీ ఎక్కడోచోట దారుణాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా ఇంట్లో నిద్రిస్తున్న రెండు నెలల చిన్నారిపై వీధి కుక్క దాడి చేసిన సంఘటన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం అంకిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గుంటి తండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన భానోత్ సురేష్ జ్యోతి దంపతులు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా వీధి కుక్క ఇంట్లోకి చొరబడి ఇంట్లో నిద్రిస్తున్న రెండు నెలల బాబు ముఖంపై తలపై తీవ్రంగా గాయపరిచి బాబును ఇంట్లో నుంచి బయటకు లాక్కెళ్తున్న క్రమంలో వెంటనే మేల్కొన్న తల్లిదండ్రులు కుక్కను వెంబడించారు.అంతలోపే కుక్క బాబు ముఖంపై, తలపై తీవ్రంగా గాయపరిచింది. ఈ దాడిలో బాబు ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంలో ఉన్న బాబును చూసి తల్లిదండ్రులు వెంటనే చుట్టుపక్కల వారికి సమాచారం చేరవేయంతో బాబును చికిత్స నిమిత్తం కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించారు. ప్రస్తుతం బాబు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బాబు ముఖంపై గాయపరచడంతో ముఖంపై శస్త్ర చికిత్సకు సుమారు పది లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు సూచించడంతో ఆర్థికంగా ఆదుకోలంటూ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.తండాలో వీధి కుక్కలు తరచుగా తిరుగుతూ దాడి చేస్తున్నాయని గతంలో పంచాయతీ అధికారరులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని తండావాసులు డిమాండ్ చేశారు.

## పడవ బోల్తా.. ఒకరి మృతి

**శ్రీలంక, జూలై 30 (తెలుగుప్రభ)**

శ్రీకాకుళం జిల్లా గుప్పెడుపేట సముద్రతీరంలో విషాదం చోటు చేసుకుంది. పడవ బోల్తా పడటంతో ఓ మత్స్యాకారుడు సముద్రంలో మునిగిపోయి మృతి చెందాడు. మరో ముగ్గురు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. వేటకు వెళుతుండగా ప్రమాదవశాత్తు పడవ మునిగిపోయింది. మృతి చెందిన వ్యక్తిని సిరిగిడి కామయ్యగా పోలీసులు గుర్తించారు. కామయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## తెలంగాణకు కేంద్ర బృందం..

### కారణం ఇదే..

**హైదరాబాద్, జూలై 30 (తెలుగుప్రభ)**

తెలంగాణలో వారం రోజుల పాటు కురిసిన భారీ వర్షాలు తీరని నష్టాన్ని మిగిల్చాయి. ప్రాణనష్టం, భారీగా ఆస్తి నష్టం జరిగింది. లక్షల ఎకరాల్లో పంట నీటమునిగింది. రోడ్లు, జాతీయ రహదారులు ధ్వంసమయ్యాయి. పలుచోట్ల.. వంతెనలు కూలిపోయాయి. చెరువులకు గండ్లు పడ్డాయి. కాలనీల్లోకి నీరు పోటెత్తటంతో వేల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. దీంతో వరద నష్టాన్ని అంచనా వేసేందుకు తాజాగా కేంద్ర ప్రభుత్వం ఓ కమిటీని వేసింది. తెలంగాణలో వరద నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రానికి కేంద్ర బృందం సోమవారం రానుంది. వివిధ శాఖల అధికారులతో కూడిన ఇంటర్ మినిస్ట్రీయల్ సెంట్రల్ టీమ్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేయనుంది.

నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సలహాదారు కునాల్ సత్యార్థి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో వ్యవసాయం, ఫైనాన్స్, జలవనరుల శాఖ, విద్యుత్తు, రోడ్డు రవాణా, రహదారులు, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ వంటి వివిధ శాఖలు, విభాగాల అధికారులు సభ్యులుగా ఉంటారు. జూలై 31న రాష్ట్రంలో పర్యటించనున్న ఈ కేంద్రబృందం వరద నష్టాన్ని అంచనా వేయనుంది. ఈ మేరకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ట్వీట్ చేశారు. వరద బాధితులకు కేంద్రం అండగా నిలుస్తుందని చెప్పారు.



## మణిపూర్ అల్లర్లు..ఇండియా పర్యటన

**న్యూ ఢిల్లీ, జూలై 30 (తెలుగుప్రభ)**

మణిపూర్‌లో జరిగిన విధ్వంసకాండ తాలూకు అగ్గి నేటికీ చల్లార లేదు. దీనిపై విపక్షాలు ఆందోళనలు కొనసాగిస్తున్నాయి. తాజాగా మణిపూర్‌లో క్షేత్రస్థాయి పరిస్థితిని మదింపు చేసేందుకు విపక్ష కూటమి ఇండియా ప్రతినిధులు ప్రస్తుతం ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. 21 పార్టీలకు చెందిన విపక్ష నేతలు మణిపూర్‌లో పర్యటిస్తూ హింసాకాండ వివరాలను స్థానికులను అడిగి తెలుసుకుంటున్నారు. కుకీ, మితైయ్ తెగలకు చెందిన ప్రజలతో మాట్లాడటంతో పాటు సహాయ పునరావాస శిబిరాలను విపక్ష ఎంపీలు సందర్శించారు. ప్రతినిధి బృందం సభ్యులు ఆదివారం మణిపూర్ గవర్నర్ అనసూయ యుకీని కలిసి విజ్ఞాపన పత్రం సమర్పించారు. తమ పరిశీలనలో తేలిన అంశాలను విపక్ష ఎంపీలు పార్లమెంట్‌లో ప్రస్తావించనున్నారు. మరోవైపు మణిపూర్‌లో విపక్ష ఎంపీల ప్రతినిధి బృందం పర్యటనను పాలక బీజేపీ తప్పుపట్టింది. విపక్ష ప్రతినిధులు కేవలం ఫొటో సెషన్‌కు, రాజకీయ యాత్రకే పరిమితమని కాషాయ పార్టీ ఆక్షేపించింది. విపక్ష నేతల ప్రతినిధి బృందంలో కాంగ్రెస్ ఎంపీలు అధీర్ రంజన్ చౌధరి, గౌరవ్ గగోయ్, టీఎంసీకి చెందిన సుశ్మితా దేవ్, జేఎంఎం ఎంపీ మహువ మజీ, డీఎంకే ఎంపీ కనిమొళి, ఆర్జేడీకి చెందిన మనోజ్ కుమార్ ఝా, ఆరెల్డీ ఎంపీ జయంత్ చౌధరి, ఆరెస్పీకి చెందిన కే ప్రేమచంద్రన్, జేడీయూ నేత రాజీవ్ రంజన్ సింగ్, జేడీయూ ఎంపీ అనిల్ ప్రసాద్ హెగ్డే, సీపీఐ నేత సందోష్ కుమార్, సీపీఎం నేత ఏఏ రహీం తదితరులున్నారు.



## నిందితుడికి 383 ఏళ్ల జైలు

### రూ.3 కోట్ల జరిమానా

### చర్చనీయాంశంగా న్యాయస్థానం సంచలన తీర్పు

**న్యూఢిల్లీ, జూలై 30 (తెలుగుప్రభ)**



ఒక కేసులో న్యాయస్థానం విధించిన తీర్పుపై తీవ్ర చర్చ జరుగుతోంది. నిందితుడికి ఏకంగా 383 ఏళ్ల జైలు శిక్ష విధస్తూ కోర్టు తీర్పునిచ్చింది. నకిలీ పత్రాలు తయారుచేసి మోసం చేసిన కేసులో ఓ వ్యక్తిపై తమిళనాడులోని కోయంబత్తూర్ న్యాయస్థానం ఈ తీర్పు ఇచ్చింది. నిందితుడికి 383 ఏళ్ల జైలుశిక్షతో పాటు, రూ.3.32 కోట్ల జరిమానాను కూడా విధించింది. తమిళనాడులోని కోయంబత్తూర్ డివిజన్‌లో జరిగిన ఆర్టీసీ బస్సుల వేలంలో అక్రమాలు జరిగాయని 1988 నవంబర్ 9న ఫిర్యాదు వచ్చింది. ఆర్టీసీ సంస్థకు చెందిన 47 బస్సులను నకిలీ పత్రాలతో విక్రయించి దాదాపు 28 లక్షల రూపాయలు మోసం చేశారని 8 మంది ఉద్యోగులపై ఉన్నత అధికారులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో అప్పట్లోనే చేరన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ అసిస్టెంట్ కోదండపాణి, డిప్యూటీ మేనేజర్ రామచంద్రన్, నటరాజన్, రంగనాథన్, రాజేంద్రన్ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ కేసులో విచారణ జరుగుతూనే ఉంది. కానీ ఈలోపే రామచంద్రన్, రంగనాథన్, నటరాజన్, రాజేంద్రన్‌లు మృతి చెందారు. అయితే ఇందుకు సంబంధించిన కేసు తీర్పును ఇటీవల న్యాయస్థానం వెల్లడించింది. కోదండపాణి తప్ప మిగిలిన ముగ్గురుని జడ్జి శివకుమార్ నిర్దోషులుగా పేర్కొన్నారు. ఆర్టీసీ సంస్థను మోసం చేసినట్లు కోదండపాణిని దోషిగా తేల్చి కఠినమైన శిక్షను విధించారు. కోదండపాణికి 47 నేరాల కింద నాలుగేళ్ల చొప్పున188 సంవత్సరాలు.. అలాగే 47 ఫోర్జరీకి సంబంధించిన నేరాలకు నాలుగేళ్ల చొప్పున మరో 188 ఏళ్లు, ఇంకా ప్రభుత్వ ఆస్తులను దోచుకున్నందుకు మరో ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. వీటిని మొత్తం కలిపితే 383 సంవత్సరాలు అవుతుంది. మరో విషయం ఏంటంటే ప్రస్తుతం ఈ నిందితుడి వయసు 82 సంవత్సరాలు. అయితే దీనిని దృష్టిలో ఉంచుకొని ఏడు సంవత్సరాల జైలు శిక్షను ఏకకాలంలో అనుభవించాలని కోర్టు తీర్పునిచ్చింది.